క్లుప్తంగా

23న ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ల

శావల్యాపురం: మండలంలోని పోట్లూరులో గల శ్రీ ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల ఈనెల 23న నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ దేవాలయానికి విశిష్ట చరిత్ర ఉంది. భక్తుల కోర్కెలు స్వామివారు తీర్చుతారని నమ్మకం. తిరునాళ్ల రోజున మహిళలు స్వామి సన్నిధిలో పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకుంటారు. దేవాలయాన్ని గ్రామస్తులు దాతల సహకారంతో అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నారు. తిరునాళ్ల సందర్భంగా గ్రామస్తులు ఏటా విద్యుత్ ప్రభలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాట్లు చేస్తున్నారు. తిరునాళ్లలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ లేళ్ల లోకేశ్వర రావు తెలిపారు.

రొంపిచర్లలో...

మండలంలోని మాచవరంలో నల్లంత ఆంజనేయస్వామి తిరునాళ్ల సోమవారం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని నిర్వాహకులు ఆదివారం తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు తీసుకోవాలని వారు కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం మహంకాళి అమ్మవారి దేవస్థానం నిర్మాణానికి దాతలు రూ.3.5లక్షల విరాళం అందజేశారు. నరసరావుపేటకు చెందిన మార్నెళ్ల శ్రీనివాస్,సౌజన్య దంపతులు రూ..2.5లక్షలు, పెరుమాళ్ల సత్యనారాయణ,ఆదిలక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళం అందించారు. ఆలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు చేతుల మీదుగా విరాళాలను దాతలు ఈవో ఎస్.మాధవీలతకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు కొత్తలంక కార్తికేయశర్మ, నందూరి కాశీకృష్ణ పాల్గొన్నారు.

స్వర్గ నిలయం ప్రారంభం



వినుకొండ : పట్టణంలోని గుంటి ఆంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ చుండూరు శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో ఆదివారం దేవాలయం సమీపంలో స్వర్గ నిలయం (కర్మల సత్రం) ప్రారంభించారు. పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ కోరారు. అనంతరం స్వర్గ నిలయానికి విరాళాలు అందజేసిన దాతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెండేల వెంకట పుల్లారావు, గజవల్లి నాగపవన్‌కుమార్, భవనాసి సాంబశివరావు, కంచర్ల భద్రయ్య, పోలా నర్సయ్య పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10గంటలకు అంబేడ్కర్ జయంతిని గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సోదరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

24న బొప్పూడిలో తిరునాళ్ల

చిలకలూరిపేట టౌన్: మండలంలోని బొప్పూడి ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం వార్షిక తిరునాళ్ల ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పవన్ నేతృత్వంలో వేకువజాము నుంచే స్వామికి అభిషేకాలు, విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పొంగళ్లు, నైవేద్యాల సమర్పణ, భజనలు ఉంటాయని చెప్పారు. రాత్రికి పలు సాంస్కృతిక, ఆధ్మాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. భారీ విద్యుత్ ప్రభలు వస్తాయని తెలిపారు.

ప్రశాంతంగా అంబేడ్కర్ గురుకుల ప్రవేశ పరీక్షలు

విజయపురిసౌత్: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలిక గురుకుల పాఠశాలలో ఆదివారం ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10 గంటలకు 5వ తరగతిలో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 12 గంటలకు ముగిసింది. ఇందుకు 139 మంది దరఖాస్తు చేసుకోగా 120 మంది ఎంట్రెన్స్ పరీక్షకు హాజరయ్యారు. అలాగే మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో చేరేందుకు నిర్వహించిన ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జరిగింది. ఇందులో 139 మంది దరఖాస్తు చేసుకోగా 120 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలను కళాశాల ప్రిన్సిపాల్ దారా మేరి మంజుల, అబ్జర్వర్ నాగేశ్వరమ్మలు పర్యవేక్షించారు.



రొంపిచర్లలో మట్టలతో ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు



ఉప్పరపాలెంలో జరిగిన వేడుకల్లో సండే స్కూల్ చిన్నారులు



తిమ్మాపురం లూథరన్ చర్చిలో వేడుకలు



నాదెండ్లలో జరిగిన వేడుకల్లో సండే స్కూలు విద్యార్థులు

రాజాధిరాజుకు జై.. జై !

శావల్యాపురం: మండలంలో మట్టల ఆదివారం వేడుకలు ఘనంగా నిర్వహించారు.ప్రార్థన మందిరాల్లో భక్తి గీతాలు ఆలపించారు.ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు ప్రార్థన మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఏసు క్రీస్తు భూలోకంలో జన్మించి, నీతి బోధనలు చేస్తూ అనేక ప్రాంతాలు సందర్శించి, సువార్తసేవ చేశారు.చివరిగా యేరూషలేం దేశంలో సందర్శినప్పుడు యూదుల ఆచారం ప్రకారం ఖర్జూర మట్టలు చేతి పుచ్చుకొని ఆయన్ను ఘనంగా ఆహ్వానించారు. ఈ రోజుని మట్టల ఆదివారంగా జరుపుకోవటం ఆనావాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా స్థానిక విమోచన ప్రార్థన మందిరంలో వేడుకలు నిర్వహించారు. మత బోధకులు సీహెచ్.యేహేజ్కేలు మట్టల ఆదివారం ప్రాముఖ్యత వివరించారు. ప్రభువు ప్రపంచానికి చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో కస్తూరి యేహెజ్కేలు, రాక్ ప్రశాంత్, నిశాంత్ పాల్గొన్నారు.

యడ్లపాడులో..

మండలంలోని అన్ని గ్రామాల్లో మట్టల ఆదివారం పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. కుటుంబ సభ్యులంతా కలిసి అలంకరించిన మట్టల్ని పట్టుకుని జయ జయ గీతాలు పాడుకుంటూ ర్యాలీగా చర్చిల వద్దకు చేరుకున్నారు. బలిపీఠం ఎదురుగా వాటిని ఉంచి స్తుతిగీతాలు, ఆరాధన, వాక్యపరిచర్య పండుగ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా తిమ్మాపురం లూథరన్ చర్చి పాస్టర్ చిన్నం డేవిడ్ సుదీప్ సాగర్ మాట్లాడుతూ ఈస్టర్ డే పండుగ ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా చేసుకుంటారని తెలిపారు. దీన్ని ఫ్యాషన్ వీక్, హోలీ వీక్‌గానూ ఆంగ్లేయులు పిలుచు కుంటారని వెల్లడించారు.

రొంపిచర్లలో..

మండలంలోని క్రైస్తవులు ఆదివారం మట్టల పండుగను జరుపుకున్నారు. మట్టలను చేతబూని క్రీస్తును స్తుతిస్తూ, పాటలను పాడుతూ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. రొంపిచర్ల ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ మద్దిరాల బుచ్చయ్య మట్టల ఆదివారం ప్రాధాన్యత గురించి వివరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మట్టల ఊరేగింపుతో పాటు చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించి, మట్టల ఆదివారం ప్రాముఖ్యతను వివరించారు.

వినుకొండలో..

మండలంలోని ఉప్పరపాలెంలో గైడెన్స్ బాప్టిస్ట్ మినిస్ట్రీస్ వారి ఎలోహిం చిన్నారుల ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో మట్టల ఆదివారం పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారులు మట్టలు చేతబూని రాజుల రాజుకు జై అంటూ నినాదాలు చేశారు. వీధుల్లో క్రైస్తవ భక్తిగీతాలను ఆలపిస్తూ ర్యాలీ నిర్వహించారు. నిర్వాహకులు అనిత వినీల్, సండే స్కూల్ చిన్నారులు పాల్గొన్నారు.



శావల్యాపురంలోని పెంతెకోస్తు మందిరం ఎదుట ఈత మట్టలతో భక్తులు

నాదెండ్లలో..

యెరూషలేం పట్టణంలోకి ప్రవేశించిన ఏసుక్రీస్తును ఆయన శిష్యులు పూలు, మట్టలతో వేడుకగా స్వాగతం పలికిన దినాన్ని గుర్తు చేసుకుంటూ క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో గీతాలు పాడుతూ పూలు గుచ్చిన ఈత మట్టలతో వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఇర్లపాడు పునీత జోజప్ప దేవాలయం పాస్టర్ యద్దనపల్లి పాల్‌రాజేష్, నాదెండ్ల ఎఫిఫానియా క్రీస్తు లూథరన్ దేవాలయంలో పాస్టర్ విస మోహన్‌రావు ఆధ్వర్యంలో చర్చి నుంచి గ్రామంలోని వీధుల్లో సండే స్కూలు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. యేసు రాజుకి జై.. సర్వాధికారైన యేసుకి జై.. దావీదు తనయుడికి జై అని కీర్తించారు.

చిలకలూరిపేట టౌన్‌లో..

దావీదు కుమారునికి జయం..తండ్రి కుమారునికి జయం..జయం అంటూ చిన్నారుల కేరింతలతో పట్టణ వీధులు మార్మోగాయి. మట్టల ఆదివారం పండుగ సందర్భంగా పట్టణంలో సాంబశివనగర్‌లోని సీయోను ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. చర్చి పాస్టర్ డాక్టర్ కేవీ వసురాజు మట్టల ఆదివారం పండుగ ప్రాధాన్యతను వివరించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసి వాక్య పరిచర్యను చేశారు. కార్యక్రమంలో పాస్టర్ ఎస్. అనిల్‌కుమార్, అజరయ్య, రత్నరాజు, ప్రతాప్, రాజేష్, జోషి, ప్రసన్న, నాని, జాషువా డానియేట్, మంత్రు నాయక్, అంజయ్య పాల్గొన్నారు.



నూజెండ్లలో వేడుకలు

నూజెండ్లలో..

మండలంలో మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఈస్టర్ పండుగ ముందు వచ్చే ఆదివారాన్ని మట్టల ఆదివారంగా పిలుస్తారు. వేకువజామునే మందిరాల్లో ప్రార్థనలు జరిపారు. అనంతరం ఈత మట్టలు పట్టుకుని పాటలతో వీధి వీధి తిరుగుతూ క్రీస్తు సందేశాలు వినిపించారు. నూజెండ్లలోని చర్చిలో పాస్టర్ ప్రభుదాసు క్రైస్తవులకు వాక్య పరిచర్య చేశారు. తాము చేసిన పాపాల ప్రక్షాళన కోసం ప్రభువు ప్రాణాలను పణంగా పెట్టి లోక సంరక్షణ చేశాడని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రామాలయంలో అన్నదానం



వినుకొండ : పట్టణంలోని ఫస్ట్ వార్డు ఎదరు బజారులో గల శ్రీ సీతారామాంజనేయ స్వామి గుడి (అవ్వ గారి గుడి) ఆవరణలో శ్రీ రామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తొమ్మిదో రోజు దాతల సహకారంతో భారీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వల్లూరి బ్రహ్మానందం, శుభ్రదేవి, రామయోగి మాస్టార్, నరసయ్య, అచ్యుత సుబ్బారావు, అప్పారావు, ప్రసాద్‌రావు, వెంకటేశ్వర్లు, సతీష్ పాల్గొన్నారు.

మహిళపై భర్త తరఫు బంధువుల దాడి

నరసరావుపేట టౌన్: భర్త తరఫు బంధువులు దాడితో పాటు తన బిడ్డను చంపుతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ ఎం.వి. చరణ్ ఆదివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వరవకట్ట ప్రాంతానికి చెందిన నాగళ్ల సాయి నాగ రజనీకి ఒంగోలుకు చెందిన అప్పాజీతో 2019లో వివాహమైంది. గుండె పోటుతో 2023లో భర్త చనిపోయాడు. అప్పటి నుంచి భర్త తరఫు బంధువులు రజనీని మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారు. దీంతో రజని తన పాపను తీసుకొని పుట్టింటికి వచ్చి వరవకట్టలో ఉంటోంది. ఈ క్రమంలో ఇటీవల టౌన్‌హాల్ వద్ద కూర్చొని సమస్యను పెద్దల సమక్షంలో మాట్లాడుకొని పరిష్కరించుకొందామని రజనీని భర్త తరఫు బంధువులు నాగళ్ల సుబ్రహ్మణ్యం, చుండూరి బసవశంకరరావు, నాగళ్ల కృష్ణలు అక్కడకు పిలిచారు. ఈ క్రమంలో ఆమెతో వాగ్వివాదానికి దిగారు. బిడ్డ ఉన్నందునే సమస్య వస్తోందని, చంపితే ఎటువంటి గోల ఉండదని బెదిరించి రజనీ పైకి వచ్చి లాక్కోబోయారు. అడ్డుకున్న ఆమెపై దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఎనీటైం (ఏటీఎం) పనిచేయదు!!

- ఆర్నెల్లుగా పనిచేయకున్నా పట్టించుకోని అధికారులు
- జగ్గాపురంరోడ్డులోని ఎస్‌బీఐ ఏటీఎం పనిచేయక ఖాతాదారులకు కష్టాలు

యడ్లపాడు: వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు బ్యాంకులు పోటాపోటీగా ఏటీఎం కేంద్రాలు ఏర్పాటు చేశాయి. కానీ వాటి నిర్వహణ మాత్రం అధికారులు గాలికి వదిలేస్తున్నారు. మండల కేంద్రమైన యడ్లపాడు గ్రామంలోని జగ్గాపురం రోడ్డులో ఉన్న భారతీయస్టేట్‌బ్యాంక్ ఏటీఎం కేంద్రం గత ఆరునెలలుగా పనిచేయడం లేదు. ఈ ఏటీఎంలో నిత్యం గ్రామస్తులే కాకుండా సమీప గ్రామాల నుంచి వివిధ పనులపై వచ్చిన ప్రజలు తమ ఖాతాల నుంచి డబ్బులను విత్‌డ్రా చేస్తుంటారు. ఒకవైపు ఏటీఎం భద్రతను గాలికి వదిలేస్తున్న అధికారులు ఆ తర్వాత వాటిని పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. రూ.40 వేల వరకు ఏటీఎంలోనే డ్రా చేసుకోవాలంటూ సలహాలు, సూచనలు చేసే అధికారులు ఆ దిశగా తమ సేవల్ని మాత్రం అందించడం లేదంటూ ఖాతాదారుల నుంచి విమర్శలు వినవస్తున్నాయి. ఇక్కడి వీధిలో కాల్వల నిర్మాణం సమయంలో నిలిచిన ఈ ఏటీఎం సేవలు ఆర్నెల్లు దాటినా తిరిగి అందుబాటులోకి తీసుకురాకపోవడంతో సదరు బ్యాంకు ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై వినియోగదారులు బ్యాంక్ మేనేజర్‌ను కలిసి సమస్యను వివరిస్తే, అది తమ పరిధి కాదని, చిలకలూరిపేట శాఖ మేనేజర్ చూస్తారని, లేకుంటే ప్రకాశం జిల్లా ఒంగోలు జోన్ అధికారికి సమాచారం ఇవ్వాలని చెప్పడం విశేషం. తమ శాఖ పరిధిలో ఉన్న ఏటీఎం పర్యవేక్షణ విషయం వేరొకరిదైనా దానికి సంబంధించి వినియోగదారుడు ఫిర్యాదు చేయాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని, స్థానిక అధికారులకు బాధ్యత ఉండదా ? అంటూ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సంబంధించి సమస్యను పరిష్కరించాలని యడ్లపాడు వాసులు కోరుతున్నారు.



యడ్లపాడు జగ్గాపురం రోడ్డులో మూతపడిన ఏటీఎం

శాస్త్రీయ దృక్పథంతోనే సమాజ ప్రగతి

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి

రొంపిచర్ల: ప్రజలు మూఢ నమ్మకాలను పక్కన పెట్టి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని ముందుకు సాగాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక బీసీ కాలనీలో భగత్ సింగ్ భవన్ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో 'శాస్త్రీయ ఆలోచనలు వాటి ప్రయోజనాలు' అనే అంశంపై ఆదివారం ఏర్పాటు చేసిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఆయన మాట్లాడుతూ మేధావుల మౌనం దేశ, రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం అన్నారు. దేశంలో సమస్యలు ఉత్పన్నమవుతున్న వేళ వాటి పరిష్కారానికి ఒకటో, రెండో సంస్థలు మాత్రమే పనిచేస్తున్నాయన్నారు. భావసారూప్యంగల అన్ని సంస్థలు కలిసి పని చేస్తేనే పరిష్కారం అవుతాయని తెలిపారు. రాజకీయ పార్టీలు, సామాజిక సేవా సంస్థలు మూస పద్ధతిలో కాకుండా ప్రజలకు అర్థమయ్యే రీతిలో ప్రయోజనం కలిగే విధానంలో పనిచేసినప్పుడే ప్రజల మన్ననలు పొందుతాయని చెప్పారు. సమాజ శ్రేయస్సు కోసం మేధావి వర్గం పని చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. మూఢ నమ్మకాలు పెచ్చరిల్లుతున్న నేపథ్యంలో జన విజ్ఞాన వేదిక వంటి సంస్థలు ప్రజలలో శాస్త్రీయ దృక్పథం పెంచేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. సమాజాన్ని శాస్త్రీయ దృష్టి వైపు మళ్లించాల్సింది పోయి తిరోగమన భావాలను వ్యాప్తి చేయడం దేశానికి క్షేమం కాదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జ్వరం వచ్చిన ఐదు రోజుల్లోపు డాక్టర్ వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. పారాసిటమాల్ వాడుకుంటే సరిపోతుందని, అప్పటికి తగ్గకపోతే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. సహజ రోగ నిరోధక శక్తి నిలుపుకోవటం కోసం శారీరక శ్రమ, వ్యాయామం, సమతుల ఆహారం ముఖ్యమని తెలిపారు. షుగర్ వ్యాధిగ్రస్తులు రోజుకు రెండు పూటలు ఆహారం తీసుకుంటే చాలని మూడవ పూట తినకుండా ఉంటే ఇన్సులిన్ స్థాయిలు పడిపోవని తెలిపారు. నొప్పులకు ఎక్కువగా బిళ్లలు వాడకూడదని తేలికపాటి వ్యాయామాల ద్వారా నియంత్రించుకోవాలని తెలిపారు. ప్రజలు ఆరోగ్య, ఆర్థిక, సామాజిక, రుగ్మతలు వచ్చినప్పుడు ఆందోళన చెందకుండా సమస్యలు ఎందుకు వచ్చాయో కనుగొని వాటి పరిష్కారానికి కృషి చేయాలని వివరించారు. ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు సరాసరి స్పెషలిస్ట్ వద్దకు వెళ్లకుండా ముందుగా జనరల్ వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో భగత్ సింగ్ భవన్ నిర్వహణ కమిటీ సరికొండ రామకృష్ణంరాజు, శేషం రాజు, మస్తాన్ వలి, జనవిజ్ఞాన వేదిక నాయకులు శ్రీ వేములయ్య, అమ్మ నేత్ర అవయవదాన ప్రోత్సాహకుల సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ చలపతిరావు, చలమారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

పారిశుద్ధ్య కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

నరసరావుపేట: అకారణంగా తొలగించిన పారిశుద్ధ్య కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. తమకు పూర్తి వేతనాలు చెల్లించాలని, విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న నిరసన దీక్షా శిబిరాన్ని ఆదివారం సందర్శించి వారికి మద్దతు పలికారు. ఆప్కాస్‌లో ఉన్న కార్మికులు తమకు పూర్తి వేతనాలు చెల్లించాలని కోరినందుకు విధుల్లో నుంచి తొలగించడం ఏ మాత్రం సబబుకాదని గోపాలరావు ఖండించారు. వెంటనే పూర్తి వేతనాలతో విధుల్లోకి తీసుకొని న్యాయం చేయాలని కోరారు. దీనిపై మున్సిపల్ అధికారుల మొండివైఖరి మంచిది కాదని హితవు పలికారు. కార్మికులకు అన్నీ మున్సిపాల్టీల్లోని కార్మికులు మద్దతు తెలియచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు సిలార్ అహ్మద్ పాల్గొన్నారు.



శిబిరంలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న రైతు సంఘ నాయకుడు గోపాలరావు

కత్తవ చెరువును కబ్జాదారుల నుంచి కాపాడండి

పీడీఎం, ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: పట్టణంలోని ఆవులు సత్రం ఎదురుగా ఉన్న చెరువును కబ్జాదారులు నుంచి కాపాడాలని దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, జి.రామకృష్ణ, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు ఆదివారం సాయంత్రం ఆ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చెరువును పూర్తిస్థాయిలో ఆక్రమించుకునేందుకు కబ్జాదారులు సిద్ధమయ్యారని, కాపాడుకోవాల్సిన బాధ్యత ఈ ప్రాంత ప్రజలపైనే ఉందని తెలిపారు. డ్రైనేజ్ ద్వారా వచ్చే మురికి నీరు ఇక్కడి నుంచి కిందకు వెళ్లకుండా కబ్జాదారులు అసలు చెరువుకే ఎసరు పెడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని ఆయన కోరారు. ఆక్రమణలు ప్రభుత్వమే తొలగించి నాలుగు వైపులా కంచే ఏర్పాటుచేసి చెరువును కాపాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. చెరువులోకి వచ్చే ఆవుల సత్రం, స్టేడియం పక్క కాలవ ఆక్రమణలు తొలగించి కాపాడాలని కోరారు.



ఆక్రమించేందుకు చదును చేసిన స్థలం

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు



నరసరావుపేట టౌన్: అగ్నిమాపక శాఖ వారోత్సవాలను పట్టణ ప్రజలు విజయవంతం చేయాలని నరసరావుపేట అగ్నిమాపకశాఖ అధికారి ఎం.వి. సుబ్బారావు కోరారు. అగ్నిమాపక శాఖ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ పల్నాడు జిల్లా అధికారి యస్. శ్రీధర్ పర్యవేక్షణలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అగ్నిమాపక వీరులకు నివాళులు అర్పించనున్నట్లు చెప్పారు. హాస్పిటల్స్, అపార్ట్‌మెంట్స్, పరిశ్రమలు, పెట్రోల్ బంకులు, గ్యాస్ గోడౌన్‌లు, ఆర్టీసీ బస్ స్టాండ్, రైల్వే స్టేషన్‌లలో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని ఆయన తెలిపారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

వినుకొండ : ఆల్ ఇండియా మజ్లిస్ ఎ ఇత్తేహదుల్ ముస్లిమీన్ (ఎంఐఎం) పార్టీ ఆధ్వర్యంలో పల్నాడు రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం నేతలు మాట్లాడుతూ రాజ్యాంగ వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న ఎన్‌డీఏ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. నూతన వక్ఫ్ సవరణ చట్టం రూపందాల్చకముందే ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. వక్ఫ్ సవరణ చట్టం వల్ల భావితరాల భవిష్యత్‌కు, అభివృద్ధికి ప్రశ్నార్థకంగా మారనుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు కరీముల్లా, షేక్ బాజీద్, బీఎస్పీ నేరెళ్ల రాజు, నాగూర్, ఫిరోజ్, ఆర్. ప్రసన్నకుమార్, కలాముద్దీన్, ఖాశీం, వంశీ, కాశయ్య పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న వివిధ పార్టీల నాయకులు

బీపీ మండల్ కృషి ఎనలేనిది

సత్తెనపల్లి: దేశ రాజకీయలలో బీసీలకు రాజకీయ ప్రాధాన్యత ఉండాలని వారి అభివృద్ధికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి బీపీ మండల్ అని బీసీ సంఘాల నాయకులు అన్నారు. బీసీల రిజర్వేషన్ల పితామహుడు బీపీ మండల్ వర్ధంతి కార్యక్రమం బీసీ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్జీవో సెంటర్‌లో ఆదివారం జరిగింది. బీసీ సంఘం నాయకుడు విప్పర్ల కొండలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాయకులు మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశ చరిత్రలో బీసీల జీవితాలలో వెలుగులు నింపడానికి కేంద్ర ప్రభుత్వానికి 40 సిఫార్సులు చేసిన బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీపీ మండల్ అని కొనియాడారు. నాయకులు ప్రత్తిపాటి హరేకృష్ణ, పులహరి బానోజీ, కుమ్మరి దస్తగిరి, చింక అంకమ్మరావు, బెల్లంకొండ వెంకట చెన్నయ్య, ఎర్రగొర్ల శ్రీనివాస్, షేక్ చిన్నషరీఫ్, చింతపల్లి లాజరు, పిల్లుట్ల ఆంజనేయులు, గుత్తికొండ కొండమ్మ, పిక్కిలి శివ, నర్రా కృష్ణ, గుంటూరు గోవింద్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

చిలకలూరిపేట: ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదివారం తన నివాసంలో సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సీఎం సహాయనిధి సాయం లక్షలాది కుటుంబాల ఆరోగ్యానికి పెన్నిధిగా మారిందని తెలిపారు. ఆర్థిక సమస్యలు వేధిస్తున్నా, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. అనంతరం 20 మంది లబ్ధిదారులకు రూ.14.59లక్షల విలువైన చెక్కుల్ని అందించారు. స్వయం ఉపాధి, చిరువ్యాపారాల నిమిత్తం బ్యాంకుల నుంచి మంజూరైన రూ.16లక్షల రుణాల్ని 10 మందికి అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు